
# చీకటిలో చిరుదీపం

రాచపూటి రమేష్



‘‘నెల రోజుల్లో దీపావళి! పిల్లలకింతవరకు కొత్తబట్టల గురించి, పిండి వంటలు, టపాకాయల గురించి మీరు అనుకోనేలేదు. పండగ సీజన్ గదా, టైలర్లందరు బిజీగా వుండే వారు. ఇప్పటి నుంచీ కొత్త బట్టల గురించి పూనుకుంటేగాని, పనవదు. కొలతలు ఇచ్చి, గుడ్డలు రెడీ అయ్యేసరికి పండగ ముంచుకొస్తుంది.’’ నేల మీద కూర్చుని చాకుతో బెండకాయలు చకచకా కట్ చేసి పళ్లెంలో వేస్తున్న రామశాస్త్రి నుద్దేశించి దెప్పిపొడిచింది జానకమ్మ వంటింట్లో నుంచే.

‘‘నాకు గుర్తులేక కాదు జానకీ, నాలుగు రోజుల్నుంచీ దగ్గు, ఆయాసం నన్ను ఊపిరి తీసుకోనివ్వడం లేదు గదా. మార్కెట్ నుంచి వస్తూ వర్షంలో తడిసిన ఎఫెక్టు. ఈ రోజే కొంచెం లేచి పని చేసుకుంటున్నానుగదా. సాయంత్రం అలా వూర్లో తిరిగొస్తానులే'' భార్యకు సమాధానం చెప్పి మళ్లీ పనిలో మునిగిపోయాడు రామశాస్త్రి.

‘‘మీరేం చేస్తారో నాకు తెలీదు. పండుగ ముందు రోజు హైరానపడితే లాభం లేదు. వేలాడేసుకొని దీనంగా వుండే పిల్లల మొఖాలు నేను చూడలేను. ప్లాను ప్రకారం ఇప్పటినుంచే అన్నీ అమర్చుకోవాలి.'' హెచ్చరికగా చెప్పింది జానకమ్మ.

‘‘పిల్లలు స్కూలు నుంచి వచ్చే టైమయింది. పాలు కాచి వుంచవా? అరరే... ఇందాక సరుకులు తెచ్చినప్పుడు పంచదార తేవడం మరిచిపోయాను. పదినిమిషాల్లో పట్టుకొస్తాను.'' చేస్తున్న పని ఆపి చేతులు కడుక్కోని షర్టు వేసుకొని బయటకు నడిచాడు రామశాస్త్రి.

పిల్లలంటే అనుక్షణం ఆరాటపడే ఆ దంపతులకు దేవుడిచ్చిన పిల్లలు లేరు. నాలుగేళ్ల నుండీ శ్రీకృష్ణా అనాథాశ్రమం నడుపుతున్నారు. అందులో వుండే ఇరవై రెండు మంది పిల్లలనే తమ సంతానంగా చూసుకుంటూ అనుక్షణం వాళ్ల బాగోగుల గురించే ఆరాటపడుతుంటారు.

అటు పల్లె, ఇటు పట్నం కాని ఆ వూర్లోనే బట్టల కొట్టు నడిపిన పరంధామయ్య దగ్గర సహాయకుడిగా ముప్పై ఏళ్ల పాటు నమ్మకంగా పనిచేశాడు రామశాస్త్రి. సేల్స్‌మెన్ నుంచి అకౌంటెంటు వరకు, ఎదిగి పరంధామయ్య వ్యాపారం అంచెలంచెలుగా ఎదగడంలో ముఖ్యకారకుడయ్యాడు. సంతానం లేని రామశాస్త్రి దంపతులకు పిల్లల పట్లగల అవ్యాజానురాగాలను గమనిస్తూనే వున్నాడు పరంధామయ్య. ఆయన కొడుకూ, కూతురు విదేశాల్లో సెటిలయ్యారు. ఎప్పుడో గాని ఇండియాకు రారు. భార్య ఎప్పుడో చనిపోయింది. తన తదనంతరం తానున్న తాతల కాలం నాటి ఇంటిని అనాథాశ్రమంగా మార్చి రామశాస్త్రి సంరక్షణలో వుంచాలని వీలునామా రాసి పోయారాయన. ఆశ్రమం నడపడానికి వీలుగా పదిలక్షలు బ్యాంకులో ఎఫ్‌డి చేసి దాని మీద వచ్చే వడ్డీతో ఆశ్రమాన్ని నిర్వహించుకోవాలని విల్లులో రాశారు.

పరంధామయ్య పోయిన తరువాత ఆయన వీలునామా రాసిన విషయం రామశాస్త్రి దంపతులకు ఆశ్చర్యానందాలు కలిగించాయి. యజమాని తనకప్పగించిన కర్తవ్యాన్ని పవిత్రమైన బాధ్యతగా భావించి రామశాస్త్రి ఆశ్రమ నిర్వహణ తన భుజస్కంధాలపై వేసుకున్నాడు. బ్యాంకు నుంచి వచ్చే వడ్డీ బొటాబొటిగా ఖర్చులకు సరిపోతూనే వుంది. పిల్లలు సర్కారు బడుల్లో చదువుతున్నందున ఫీజుల ఖర్చు పెద్దగా లేదు కానీ, పుస్తకాలు, టిఫిన్లు, భోజనాల ఖర్చు, మందులు మాకుల ఖర్చు చాలానే అవుతోంది. తీరిక సమయాల్లో నాలుగు కొట్లల్లో అకౌంట్స్ రాస్తూ అదనపు భారాన్ని సర్దుబాటు చేస్తున్నాడు రామశాస్త్రి.

మొదటి రెండేళ్లు ఆశ్రమంలో పండుగలు బొత్తిగా జరపలేదు. మిగతా పిల్లలందరూ కొత్త బట్టలు కట్టుకొని, స్వీట్లు తిని టపాకాయలు కాలుస్తూ వుంటే ఆశ్రమంలోని పిల్లలు బిక్క మొగం వేసుకొని చూడడం ఆ దంపతులకు బొత్తిగా మింగుడుపడలేదు.

రెండేళ్ల క్రితం సింపుల్‌గానైనా దీపావళి జరపాలన్న నిశ్చయానికి వచ్చారు. కాళ్లకు చెప్పులరిగేలా వూర్లోని ధనవంతుల దగ్గర విరాళాల కోసం తిరిగాడు రామశాస్త్రి. చివరకు కొత్తబట్టలకొకరు, టపాకాయలకు ఒకరు విరాళాలిచ్చారు. టైలరు ఛార్జీల భారం రామశాస్త్రి తనే మోయవలసి వచ్చింది. ఏడాది క్రితం చుట్టపు చూపుగా ఆ వూరొచ్చిన ఎన్నారై ఒకరు ఆదారిలో వెళుతూ, ఆశ్రమం లోపలకి వచ్చి, పరిస్థితి తెలుసుకొని, అన్ని ఖర్చులూ తానే భరించి దీపావళి పండుగను జరిపించి పిల్లల మొహాల్లో నవ్వుల పూలు పూయించాడు. ఈసారి ఆ మహానుభావుడు వూర్లోకి రాలేదు. నెల రోజులు ప్రయత్నిస్తే గాని కార్యం సమకూరదని తెలిసిన రామశాస్త్రి తన



వంతు ప్రయత్నం మొదలుపెట్టాడు.

అది ఒక అధునాతనమైన బంగ్లా. హాల్లోని ఫర్నిచర్, ఖరీదైన కర్టెన్లు, తివాచీ, ప్రస్ఫుటంగా కనిపించే షాండ్లియర్ ఇంటి వారి ఆడంబరాన్ని ఐశ్వర్యాన్ని చెపుతున్నాయి.

''మీరేమైనా చెప్పండి అవధాన్లు గారు, అబ్బాయికి నెలరోజుల కన్నా ఒక్కరోజు ఎక్కువ కూడా ఇండియాలో వుండేందుకు వీలు లేదు. ఆ నెలలోనే పిల్లను చూడడం, సంబంధం సెటిల్ చేసుకోవడం, ముహూర్తాలు పెట్టుకోవడం కూడా ఐపోవాలి. పెళ్లి కావాలంటే మూడు నాలుగు నెలల తరువాత తీరిగ్గా పెట్టుకోవచ్చు'' ఖచ్చితంగా చెప్పాడు ఉమాపతి. టిఫెన్ చేస్తున్న పెళ్లిళ్ల పేరయ్య అవధానితో.

''అంతే కాదు అవధాన్లు గారు, మాకున్నది ఒకే అబ్బాయి. అబ్బాయి పెళ్లి కుదిరితే తిరుపతి కొచ్చి శ్రీనివాసుని కళ్యాణోత్సవం జరిపిస్తామని, కాళహస్తిలో రాహుకేతు పూజ జరిపిస్తామని కూడా మొక్కుకొని వున్నాము. ఇంక అంత దూరం వెళ్లాక కాణిపాకం, కంచి వెళ్లి దర్శనం చేసుకోకుండా రావడం బాగుండదు కదా.'' దీర్ఘాలు తీస్తూ అంది మీనాక్షమ్మ గాల్లోకోసారి చేతులు జోడించి.

పక్కనే సోఫాలో కూర్చుని వున్నామె తమ్ముడు చిదంబరం అందుకున్నాడు. ''మా బావగారి ఇష్ట దైవం షిర్డీ సాయిబాబా. మా అక్కకు అన్నవరం సత్యనారాయణస్వామి అపారమైన నమ్మకం. మా శీను మ్యారేజ్ ఫిక్స్ అయితే వెంటనే ఆ రెండు ప్రదేశాలకు వెళ్లి రావల్సిందే. ఎప్పటినుంచో వున్న మొక్కులు తీర్చుకోవలసిందే'' హుకుం జారీ చేసినట్లు చెప్పాడు,


ఆ సరికి అవధాని టిఫిన్ చేయడం, వాష్‌బేసిన్లో చేతులు కడుక్కోవడం ముగించి పనివాడు కోటయ్య అందించిన నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకొని, తన లెదర్ బ్యాగులోంచి ఒక కవర్ తీసి అందులోంచి కొన్ని ఫోటోలు, కాగితాలు బయటకు తీశాడు.

''అయ్యా! ఉమాపతి గారూ! మీ అబ్బాయి శీను నెలరోజులకు మించి ఇండియాలో వుండడంటున్నారు. ఈలోగా అమ్మాయిని చూడడం, ముహూర్తాలు పెట్టుకోవడం అన్ని దేవాలయాల్లో మొక్కులు తీర్చుకోవడం పూర్తి కావడమంటే సామాన్యం కాదు. అంటే రెండు వారాల్లో సంబంధం సెటిల్ కావాలి. ఇంకే మధ్యవర్తి అయినా ఇలాంటి సిట్యూయేషన్‌లో చేతులు ఎత్తేసేవాడే. కానీ, నాకీ ఫీల్డు కొట్టిన పిండి. మీ ఎక్స్‌పెక్టేషన్లు కాచి వడపోసి ఓ పదిహేను అలయెన్సులు పట్టుకొచ్చా. వీటిలో నాలుగైదు మీకు నచ్చిన సంబంధాలు సెలక్ట్ చేస్తే పెళ్లిచూపులకు డేట్స్ ఫిక్స్ చేసేద్దాం'' అన్నాడు కోటయ్య ట్రేలో తెచ్చిన టీ గ్లాసు అందుకుంటూ...

ఉమాపతి, మీనాక్షమ్మ, చిదంబరం ఆకలి గొన్న వ్యాఘ్రాల్లా అవధాని అందించిన ఫోటోలపై కలియబడి, వాటికి పిన్ చేసిన వివరాలు చదవసాగారు.

''బావా... ఈ నంద్యాల సంబంధం చూడు. అమ్మాయి ఎంసియే పాసైంది. వాళ్ల నాన్న పంచాయితీరాజ్ డీఇ. ఎంతలేదన్నా ఈసరికి రెండు మూడు కోట్లు వెనకేసే వుంటాడు. ఒక్కత్తే కూతురంట. బాగా ముట్టజెప్పగలరు. ఆలోచించుకో'' కట్టలోంచి ఓ ఫోటోని పీకి అనౌన్స్ చేశాడు చిదంబరం సంబరంగా.

''ఈ కాకినాడ అమ్మాయి నల్లగా వున్నా, ఒళ్లంతా ఏడువారాల నగలు దిగేసుకొని ఎంత లక్షణంగా వుందో చూడండి. వాళ్ల నాన్నకు రెండు రెసిడెన్షియల్ కాలేజీలున్నాయట. నెలకైదారు లక్షలు కళ్లచూడొచ్చు.'' ఆత్రంగా ఓ ఫోటోను చూపుతూ అంది మీనాక్షమ్మ.




ఇంతలో పనివాడు కోటయ్య వరండాలోంచి వచ్చి, ''అయ్యగారూ, మిమ్మల్ని చూడడానికెవరో రామశాస్త్రి గారంట బయట వెయిట్ చేస్తున్నారు'' అన్నాడు.

''సరే...లోపలకు రమ్మను'' పెళ్లికూతుళ్ల బయోడేటాలు చదువుతున్న ఉమాపతి అన్యమనస్కంగా అన్నాడు.

ఖద్దరు చొక్కా, పంచలో వున్న రామశాస్త్రి భయంగా లోనికి వచ్చి, ఉమాపతికి నమస్కరించి ఓ మూలగా నిలబడ్డాడు.

ఆయన ఉనికిని గమనించనట్లే ఉమాపతి ''సరే, మనకూ అబ్బాయికి బాగా నచ్చిన అలయెన్సు సెటిల్ చేస్తామనుకో. పదిరోజుల్లో ఇన్ని పుణ్యక్షేత్రాలు తిరిగిరావడం సాధ్యమయ్యే పనేనా, మన ఆరోగ్యాలు ఏం కావాలి?'' అన్నాడు గాబరాగా చిదంబరంతో. బ్రూక్లీన్‌లో డాక్టరుగా ప్రాక్టీసు చేస్తున్న కొడుకు శీను అస్సలు ఈ జర్నీల కొప్పుకోడనుకున్నారు.

చిదంబరం కల్పించుకుంటూ ''ఆ సంగతి నాకొదిలేయ్ బావా! ఎయిర్ ట్రావెల్ బాగా చీప్పైపోవడంతో బాటు ఇప్పుడు దాదాపు అన్ని సిటీస్‌కు ఫ్లైట్లున్నాయి గదా. నాకు తెలిసిన ట్రావెల్ ఏజెంట్‌తో మాట్లాడి ఎయిర్‌పోర్టు నుంచి టాక్సీలు, హోటల్ రూంలు బుక్ చేయిస్తాను. దేవుడి మొక్కులు నిర్లక్ష్యం చేస్తామా? ఎటొచ్చి కొంత డబ్బు, ష్ట్రెయిన్‌తో కూడుకున్న పని'' అన్నాడు.

''ఈ టైంలో ఖర్చు గురించి ఆలోచించకూడదు.'' అని ఏదో చెప్పబోతూ ఉమాపతి రామశాస్త్రిని అప్పుడే గమనించినవాడిలా, ''ఎవరు మీరు? నాతో ఏం పని?'' అన్నాడు. చిరాగ్గా తప్పదన్నట్లు మాట్లాడుతూ,

రామశాస్త్రి తత్తరపడుతూనే తానొచ్చిన పనిని వివరించాడు. టపాకాయల డొనేషన్ గురించి వినగానే ఉమాపతి విసుక్కుంటూ, ''మాకే ఎన్నో ఖర్చులు, తలనొప్పులూ వున్నాయి. ఇప్పుడు కుదరదు. మరోసారి కనిపించండి'' అన్నాడు చీదరగా మొహం పెట్టి.

''అయ్యా అలా అనకండి. పిల్లలకు కొత్త బట్టలకు లక్ష్మి గార్మెంట్స్ నాగరాజ చెట్టి, భోజనాలకు విష్ణు భవన్ గురవయ్య గారు స్పాన్సర్ చేస్తామన్నారు. టపాకాయలకొక వెయ్యి రూపాయలు మీరు దయచేస్తే పిల్లలు ఆనందంగా పండుగ జరుపుకుంటారు'' ప్రాధేయపడుతూ అన్నాడు రామశాస్త్రి.

''చెప్పేది నీక్కాదా? ఇలాంటి కేసులు రోజూ నాకు తగుల్తూనే వుంటాయి....'' అని ఉమాపతి ఏదో కసురుకునేలోగా, పనివాడు కోటయ్య కల్పించుకుంటూ, ''బాబూ, ఇంట్లో శుభకార్యం జరిగే సమయం. ఏ పుట్టలో ఏ పాముందో, పసివాళ్లకు దానం చేస్తే పుణ్యం, దేవుడి ఆశీస్సులు దక్కుతాయి'' అన్నాడు చేతులు నలుపుకుంటూ...

ఉమాపతి కోటయ్య వంక ఓసారి తీక్షణంగా చూసి, ''సరే, నాకిప్పుడు టైం లేదు. పండగ

ముందు రోజుకనిపించండి. ఆ...అవధాన్లు, ఆ గుడివాడ సంబంధం వాళ్లు ఏమాత్రంలో వున్నా రంటారు...'' అని మళ్లీ విషయంలోకి వచ్చాడు.

రామశాస్త్రి గోడమీద వున్న దేవుడి ఫోటోలకు నమస్కరించి బయటకు నడిచాడు. కోటయ్య ఆయనను గేటు వరకూ సాగనంపాడు.

రాష్ట్ర ప్రభుత్వంలో భారీ ఆదాయం, నెలవారీ పర్సెంటేజీలు రెగ్యులర్‌గా అందే ఓ కీలకమైన శాఖలో గెజిటెడ్ ఆఫీసర్‌గా పదిహేనేళ్లు పనిచేసి బాగా వెనకేశాడు ఉమాపతి. ఆయన భార్య మీనాక్షమ్మకు పుట్టింటి నుంచి భారీగా ఆస్తిపాస్తులు కలిసొచ్చాయి. నాలుగేళ్ల క్రితం వాళ్ల అమ్మాయి శశికి ఆడంబరంగా వివాహం చేశారు. ఏకైక కుమారుడు శీనుపెళ్లి విషయంలో కూడా ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా తమ అంచనాలకు తగిన భారీ కట్నాన్ని, కానుకలను రాబట్టాలని సన్నాహాలు చేస్తున్నారు.

''ఏ దేవుడు కరుణించాడో! అన్నీ అమర్చినట్లు కుదిరాయి. నిశ్చితార్థమే పెళ్లి చేసినంత ఘనంగా చేశారు. మన వాడు అదృష్టవంతుడు. ఆ కాకినాడ సంబంధం సెటిలవడం మన లక్కే'' ఈజీ చైర్లో కూర్చుని భుక్తాయాసంతో వక్కపలుకులు నములుతూ అన్నాడు ఉమాపతి. ఇంకా అతనికి ప్రయాణ బడలిక తీరలేదు.

''మీకలానే వుంటుంది. మరో ఐదు లక్షలు క్యాష్, ఆడబడుచు కట్నం కింద ఇంకోముప్పై తులాల బంగారం డిమాండ్ చేసుండాల్సింది.'' రుసరుసలాడుతూ అంది మీనాక్షమ్మ.

''నేనంత పిచ్చివాడ్నా? అమ్మాయి ఒక్కటే సంతానం కదా వాళ్ళకు ఉన్నదంతా మనవాడికే. అంతగా వుంటే ముహూర్తం ముందు అడుగుదాంలే. ఈ వూళ్లని తిరిగి ఒళ్లు హూనమయింది. ఫ్లైట్లో తిరుపతి, షిర్డీలకు వెళ్లినా, మిగతాదంతా ఆ డొక్కు రోడ్డు జర్నీలే గదా. కోటయ్యను వేడి కాఫీ తీసుకురమ్మను'' ఆర్డరు వేశాడు ఉమాపతి.

''కూర్చోపెట్టి జీతమిస్తున్నాం. అరవై ఏళ్లు దాటినట్లున్నాయి ముసిలాడికి. ఇంక ఇంటికి పంపేయ్యండి. పెళ్లి పనులు బయట పనులు ఇంకాచాలా వుంటాయి. రెండు నెల్లు ఏ కుర్రాడినో పన్లో పెట్టుకుంటే చాలు. ఆ తరువాత మనమే అమెరికాలోనో వుంటాం కదా. పనివాడి అవసరం వుండదు'' సలహా ఇచ్చింది మీనాక్షమ్మ గడుసుగా.

''సరే, నేను మాట్లాడుతాను'' అని ఉమాపతి అంటూండగానే బరువైన సరుకుల సంచితో గస బోసుకుంటూ ఇంట్లోకి వచ్చాడు కోటయ్య.

సరుకులన్నీ వాటి స్థానంలో సర్ది, ఇల్లు, వాకిలీ వూడ్చి హాల్లోకి వచ్చి గుడ్డతో ఫర్నీచర్ తుడవసాగాడు కోటయ్య. ''కోటయ్యా, ఇలా రా.'' పేపరు చదువుకుంటున్న ఉమాపతి పిలిచాడు. వినయంగా దగ్గరకు వచ్చి చేతులు కట్టుకొని నిలుచున్నాడు కోటయ్య.

''నువ్వు బాగా పెద్దవాడైపోయావు. ఎన్నాళ్లని పనిచేస్తావ్? ఇంక ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకో'' చెప్పాడు ఉమాపతి.

కోటయ్య అవాక్కయ్యాడు. ఇంటెడు పని ఒంటి చేత్తో చేస్తున్నాడు. తన పనిలో ఏం లోపం వచ్చిందోనని హడలిపోయాడు.

''అయ్యా... ఉన్నపళంగా వెళ్లమంటే...'' ఇరవై ఏళ్ల నుంచి నమ్మకంగా పనిచేస్తున్న తనను హఠాత్తుగా పనిలోంచి తీసేయ్యడం కోటయ్య కెంత మాత్రం మింగుడుపడలేదు.

''మేం డెసిషన్ తీసుకున్నామయ్యా. ఇంక ఆలోచించేది లేదు., బయటెవరో కాలింగ్ బెల్ నొక్కుతున్నారు. వెళ్లి చూడు.'' గొంతులోకి కాఠిన్యం తెచ్చుకొని చెప్పాడు ఉమాపతి.

కోటయ్య నిట్టూరుస్తూ వెళ్లి మెయిన్ డోర్ తీశాడు. కోటయ్య, అతని వెనుకే రామశాస్త్రి లోనికి వచ్చారు.

''ఎవరయ్యా నువ్వు, అడిగి లోపలకు రావాలని తెలీదా? కాసేపు బయటే కూర్చోరాదా?'' రామ శాస్త్రి అవతారం చూసి ఏవగించుకుంటూ చిందులు తొక్కాడు ఉమాపతి.

''అయ్యా బయట చాలా పనులున్నాయి.


NCMDT - ద్వారా కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆధ్వర్యంలో

మల్టీమీడియా యానిమేషన్ కోర్సుల్లో శిక్షణ



కోర్సుల వివరాలు :
1. మీడియా యానిమేటర్
2. మీడియా డిజైనర్
3. వెబ్ డిజైనర్
4. పిజి డిప్లమా ఇన్ యానిమేషన్ టెక్నాలజి
5. పిజి డిప్లమా ఇన్ మల్టీమీడియా యానిమేషన్



60% వరకు ఫీజులో రాయితీ/తగ్గింపు

NCMDT సెంటర్ ఫర్ మల్టీమీడియా డిజైన్ అండ్ ట్రైనింగ్
(ISO 9001:2000 సర్టిఫైడ్, కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆమోదిత శిక్షణాకేంద్రం)

నేడు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మల్టీమీడియా, యానిమేషన్ రంగాలలో అత్యధికంగా అవసరమవుతున్న ఉద్యోగాలను దృష్టిలో ఉంచుకొని మల్టీ మీడియా రంగంలో శిక్షణను అందించుట ద్వారా యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలను పెంపొందించేందుకు కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆమోదిత మల్టీమీడియా యానిమేషన్ కోర్సుల్లో NCMDT 60% వరకు ట్యూషన్‌ఫీజులో రాయితీ/తగ్గింపునిస్తూ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి శిక్షణకు ఎంపికకై రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు కోరబడుచున్నవి.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తెల్లకాగితంపై దరఖాస్తు చేస్తున్న కోర్సు పేరు, అభ్యర్థి పేరు, తండ్రి పేరు, వృత్తి, వార్షిక ఆదాయం, పుట్టిన తేది, చిరునామా, విద్యార్హత, మార్కులు, రిజర్వేషన్, దగ్గరలోని శిక్షణాకేంద్రము, అభ్యర్థి సంతకము జతపరుస్తూ సెలక్షన్ లెటర్ పంపించుట కొరకు అయిదు రూపాయల పోస్టల్ స్టాంప్ అంటించిన స్వంత చిరునామా గల కవర్‌ను క్రింది అడ్రస్‌కు 15 రోజులలోగా అందేటట్లుగా పోస్ట్ లేదా కొరియర్ ద్వారా పంపవలెను. చివరితేదీ తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులకు శిక్షణా కేంద్రం వివరాలు, కోర్సు బ్రోచర్, సెలెక్షన్ లెటర్ పోస్టు ద్వారా పంపించబడును.

దరఖాస్తు పంపవలసిన చిరునామా :
NCMDT Centre for Multimedia Design And Training
NCMDT Block, C-201, Mayur Kushal Complex, Beside Chermas, Abids, Hyderabad - 500 001. Ph : 040 - 23298720, 23298721 Cell : 9347525128

మల్టీమీడియా యానిమేషన్ కోర్సులలో శిక్షణ నిర్వహించుటకు కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్/స్టడీ సెంటర్లు ఫోన్ చేయండి : 9347525128, 040-23298720

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో

కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ కోర్సు [CTTC]

మాంటిస్సోరి (నర్సరీ), ప్రీ-ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులు

ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ చేస్తున్న/చేసిన విద్యార్థినీ విద్యార్థుల నుండి రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల ఆహ్వానము - 2007



కేంద్రప్రభుత్వరంగసంస్థ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 150 ఐ.టి. మాస్టర్ ఫౌండేషన్ ఆమోదిత శిక్షణా కేంద్రాల ద్వారా నిర్వహించ బడు పై కోర్సులలో శిక్షణ పొందుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి ఎంపికకై దరఖాస్తులు కోరబడుచున్నవి.

కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ కోర్సు (సి.టి.టి.సి) - 12 నెలలు, మాంటిస్సోరి (నర్సరీ)–డి.ఎం.టి.టి.సి– 6 నెలలు, పి.పి.టి. టి.సి.– 6 నెలలు, టెన్త్‌పాస్, ఇంటర్, డిగ్రీ చేసిన, చేస్తున్న వారు, నిరుద్యోగులు, దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణ పూర్తి అయిన తరువాత కేంద్రప్రభుత్వ రంగసంస్థ ఆమోదిత ఐ.టి. మాస్టర్ ఫౌండేషన్‌సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ఉద్యోగావకాశాలు : నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని స్కూళ్లలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రవేశ పెట్టడంతో అటు ప్రభుత్వ గుర్తింపు గల స్కూళ్లలోను, ఇటు ప్రైవేటు స్కూళ్లలోను లక్షలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ కోర్సు చేసిన అభ్యర్థులకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపు గల ప్రైవేట్ / ప్రభుత్వేతర స్కూళ్లలో మరియు వివిధ విద్యాసంస్థలలో, కంప్యూటర్ టీచర్స్‌గా, ఇన్‌స్ట్రక్టర్స్‌గా, ల్యాబ్ ఫాకల్టీగా, స్కూల్ కంప్యూటర్ ఆపరేటర్స్‌గా వివిధ ఉపాధి అవకాశాలు కలవు.

ఎస్.సి., ఎస్.టి., బి.సి. విద్యార్థులకు, ప్రత్యేక రిజర్వేషన్‌తోపాటు 15% ఫీజు తగ్గింపు కలదు.

ఆసక్తి గలవారు తెల్ల కాగితంపై పేరు, తండ్రి పేరు, విద్యార్హత, కులము, వార్షిక ఆదాయము, చిరునామా, దగ్గరలోని శిక్షణా ప్రాంతము వ్రాసి, సంతకం చేసి స్వంత చిరునామా గల కవరును జతచేసి 15 రోజుల లోపల దిగువ చిరునామాకు పంపవలెను.

చిరునామా : ప్రోగ్రామ్ డైరెక్టర్, ఐ.టి. మాస్టర్ ఫౌండేషన్, 303, కోణార్క్ డయాగ్నస్టిక్ సెంటర్ పైన, కోణార్క్ టవర్స్, దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-36. ఫోన్ : 98660 61936, 040-65977195

మా సంస్థ ప్రాతినిధ్యంలేని ప్రాంతాలలో పై శిక్షణ కార్యక్రమం నిర్వహించుటకు కంప్యూటర్ శిక్షణా సంస్థలు, కంప్యూటర్లు కలిగియున్న స్కూల్స్, కాలేజీలు ఫ్రాంచైజీకై సంప్రదించండి. ఫోన్ : 98660 61936

IT MASTER FOUNDATION
SKILL DEVELOPMENT LEARNING CENTRE

• కేంద్ర ప్రభుత్వరంగసంస్థ ఆమోదిత సర్టిఫికేషన్ • ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ • ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్

అర్ఫన్స్‌కు మీరిస్తానన్న వెయ్యి రూపాయలు ఇప్పిస్తే టపాసులు కొనుక్కోని వెళ్లిపోతాను'' అభ్యర్థనగా అడిగాడు రామశాస్త్రి.

''వెయ్యి లేదు, గియ్యి లేదు. ఏదో మాటవరసకంటే బాకీ వున్నట్లు వచ్చేస్తావా? కోటయ్య అడ్డమైన వాళ్లను ఎందుకు లోపలకు రానిస్తావు?'' చిర్రుబుర్రులాడుతూ అరిచాడు ఉమాపతి.

''పూజలనీ, శాంతి హోమాలనీ, హోటళ్లు, టాక్సీలనీ ఇప్పటికే వేలకివేలు ఖర్చయింది మాకు. మళ్లీ ఈ సంతగోలేమిటి?'' అప్పుడే హాల్లోకి వచ్చిన మీనాక్షమ్మ అందుకుంది చేతులు తిప్పుతూ...

రామశాస్త్రి అవమాన భారంతో వెనుదిరిగాడు.

''నీకు సపరేటుగా చెప్పాల్నా? సామాను సర్దుకొని దయచెయ్యి'' కోటయ్యతో వెటకారంగా అన్నాడు ఉమాపతి.

''పోతానుసార్! మీరు వుండమన్నా వుండను. ఏడాది క్రితం మీకు టైఫాయిడ్ జ్వరం వచ్చినప్పుడు, పసిరికలు సోకినప్పుడు రెండునెలలు రాత్రి, పగలు సేవలు చేశాను. రెండు వేలు నాకప్పుడు ఇస్తానంటే తరువాత తీసుకుంటానన్నాను. ఆ డబ్బు ఇప్పించండి'' ధృఢమైన స్వరంతో అన్నాడు కోటయ్య.

''ఏరా, ఒళ్లు కొవ్వెక్కిందా? ఏదో మాటవరసకంటే నీకు బాండు రాసిచ్చినట్లు డిమాండ్ చేస్తున్నావే? రెండు వేలు కాదు, ఇరవై రూపాయలు కూడా ఇవ్వను'' కోపంగా అన్నాడు ఉమాపతి.

''నేనేమీ పుణ్యానికి అడగడం లేదు. పన్లోంచి తీసేటప్పుడు పాత బాకీలు, మూడునెల్ల జీతం ఇవ్వాలి న్యాయంగా. మాకూ యూనియన్ వుంది. పది మందిని తెచ్చి ఇంటి ముందు గొడవ చెయ్యాలా?'' జంకకుండా రిటార్టు ఇచ్చాడు కోటయ్య గొంతు పెంచుతూ..

మీనాక్షమ్మ ఉమాపతిని పక్కకు పిలిచి చెప్పింది. ''పెళ్లికి ముందు ఎందుకు వెధవ న్యూసెన్సు? ఆ రెండు వేలు వాడి మొహాన పారేయ్యండి. గొడవలు జరిగితే మళ్లీ మూడునెల్ల జీతం కట్టియ్యాలి'' అంది.

ఉమాపతి విసుక్కుంటూ వెళ్లి రెండువేలు తెచ్చి కోటయ్యకు ఇచ్చాడు. తన ట్రంకు పెట్టె సర్దుకొని బయటకు వెళ్లిపోయాడు కోటయ్య.

అనాథాశ్రమం వరండాలో వుసూరుమని కూల బడి వున్నాడు రామశాస్త్రి. అతనికే పనీ చేయాలనిలేదు. పిల్లలందరూ కొత్తబట్టలు కట్టుకొని, విందు భోజనం ముగించి, కాసేపు పడుకొని ప్లేగ్రౌండ్‌లో ఆడుకోవడానికి గంతులువేస్తూ వెళ్లారు. సాయంత్రానికి టపాకాయలు షాపు నుంచి వస్తాయని చెప్పాడు. రాగానే వాటి గురించి అడుగుతారు. వారికేం సమాధానం చెప్పాలో రామశాస్త్రికి బోధపడ్డం లేదు.

''పోనీ బ్యాంకునుంచి ఓ వెయ్యి రూపాయలు డ్రా చేసుకొని వచ్చి పటాసులు తెచ్చి వుండాల్సింది.'' బియ్యం బాగు చేస్తున్న జానకమ్మ అన్నది జీరబోయిన గొంతుతో.

''బ్యాలెన్సు రెండు వేలకు మించి లేదు. ఇంకా ఈ నెల్లో ఇరవై రోజులు గడవాలి. షాపుల వాళ్లు ఇచ్చిన జీతం కూడా పిల్లల పుస్తకాలకు, స్కూలు ఫీజులకు సరిపోయింది. ఇంకేమైనా ఎమర్జెన్సీ వస్తే ఏంచేయాలి?'' బాధగా వాపోయాడు రామశాస్త్రి.

''పోనీలెండి, ఏం చేస్తాం. కాలనీలో పిల్లలందరు టపాసులు కాలుస్తూ వుంటే మనవాళ్లు చూసి ఆనందిస్తారు. ఎవరి తోడు లేని పిల్లలకంతే ప్రాప్తం అనుకోవాలి'' కళ్లనీళ్లతో అన్నది జానకమ్మ.

చెక్కగేటు తీసుకొని, కోటయ్య లోపలకు వచ్చాడు. అతడిని, అతని చేతిలోని ట్రంకు పెట్టెను ఆశ్చర్యంగా చూశాడు రామశాస్త్రి.

కోటయ్య ట్రంకుపెట్టె నేలపై పెట్టి రామశాస్త్రికి నమస్కరించి చెప్పాడు.

''బాబూ నేను పనిమానేసి మా వూరెళ్లిపోతున్నాను. దిక్కులేని పిల్లకాయలకు ఇంత చేస్తా వుండారు. మీకు చేతులెత్తి మొక్కాలి. ఈ డబ్బుతో పిల్లలకు టపాసులు కొనియ్యండి. అందరితో బాటు సంతోషంగా కాలుస్తారు'' అని రామశాస్త్రి చేతిలో రెండు వేల రూపాయలుంచాడు కోటయ్య.

రామశాస్త్రి అవాక్కయ్యాడు. ఆనందంతో అతనికి నోట మాటరాలేదు. జానకమ్మ పరిస్థితి కూడా అలాగే వుంది.

కాసేపటికి తేరుకొని ''పని మానేసి ఇంటికి వెళుతున్నానంటున్నావు. ఈ డబ్బు నీకు అవసర పడుతుందేమో చూడు. మా అవస్థలు మేమ పడతాము''అన్నాడు సందేహిస్తూ రామశాస్త్రి.

''అయ్యా...నాకు వూర్లో మూడెకరాల మడి చెక్క వుంది. కొడుకు, కోడలూ వున్నారు. ఒంట్లో ఓపికున్నంత కాలం కష్టపడి బతుకుతాను. ఇన్ని రోజులు దాచుకున్న డబ్బులుండాయి. మీ లాంటి వాళ్లకు అవసరంలో నాకు చేతనైంది చేశాననే తృప్తి వుండనీయండి నాకు'' అని కోటయ్య మళ్లీ రామశాస్త్రికి, జానకమ్మకు నమస్కరించి పెట్టె తీసుకొని వెళ్లిపోయాడు.

రామశాస్త్రి కోటయ్య వెళ్లినవైపే చూస్తూ వుండిపోయాడు. అతని కళ్లల్లో ఆనందబాష్పాలు నిలిచాయి.

''గాఢాంధకారంలో కాంతులు నింపగల సత్తా వున్న వాళ్లు తమకేమి పట్టనట్లు వూరుకుంటే చీకటిలో చిరుదీపమైన వెలిగించాలన్న కోటయ్య లాంటి వారి తపనే కొందరి చీకటి బతుకుల్లో నైనా కాంతి నింపగలదు'' భావోద్వేగాలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ అనుకున్నాడు రామశాస్త్రి.

హఠాత్తుగా ఒక తారాజువ్వ నింగకెగసింది. సందె వెలుగుల్లో కొత్త కాంతులు దివి నుంచి నేల రాలి ఆ ప్రాంగణమంతా పరుచుకున్నాయి.

★

